క్లుప్తంగా

కష్టపడితేనే ఫలితం



భక్తులకు ప్రవచనాలు చేస్తున్న అనిల్‌కుమార్ జోషి

కందుకూరు: అమావాస్యను పురస్కరించుకుని గురువారం మండలంలోని పులిమామిడి పరిధి శ్రీ నిఖిల్ చేతనా కేంద్రంలో బ్రహ్మశ్రీ గురూజీ అనిల్‌కుమార్ జోషి ఆధ్వర్యంలో ప్రత్యేక హోమం నిర్వహించారు. పూర్ణాహుతి చేసి భక్తులకు ఆశీర్వాదంతో పాటు.. అన్నప్రసాదం వితరణ చేశారు. ఈ సందర్భంగా గురూజీ మాట్లాడుతూ.. సమాజంలో నిత్యం ఎదురయ్యే సమస్యలను అధిగమించడానికి పాజిటివ్ దృక్పథాన్ని అలవర్చుకోవాలి సూచించారు. దీనికి మించిన సాధన మరొకటి లేదని పేర్కొన్నారు. సాధనతో భగవంతుడి కృపకు త్వరగా పాత్రులు కాగలరని తెలిపారు. కష్టపడితేనే ఫలితం దక్కుతుందని, కష్టపడే తత్వాన్ని అలవర్చుకుంటే అసాధ్యమైన పనులను సుసాధ్యం చేసుకోవచ్చునని వెల్లడించారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల అందజేత



విద్యార్థికి స్కాలర్‌షిప్ అందజేస్తున్న బీజేపీ నాయకులు

మీర్‌పేట: జస్టిస్ కొండా మాధవరెడ్డి ఫౌండేషన్ సహకారంతో బీజేపీ మీర్‌పేట కార్పొరేషన్-2 అధ్యక్షుడు తులసి ముఖేష్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం జిల్లెలగూడ కమలా నెహ్రూనగర్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు పలకలు, నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం జిల్లెలగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గతేడాది 10వ తరగతిలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించిన ముగ్గురు విద్యార్థులకు రూ.2500ల స్కాలర్‌షిప్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ముఖేష్‌కుమార్ మాట్లాడుతూ.. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని కార్యక్రమం చేపట్టామని, భవిష్యత్తులోనూ అనేక సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. పార్టీ మీర్‌పేట-1 అధ్యక్షుడు భిక్షపతిచారి, నాయకులు కీసర గోవర్ధన్‌రెడ్డి, సోమేశ్వర్, గాజుల మధు, గోపీనాథ్, కాశీరాం, వేణుగోపాల్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హుడాకాంప్లెక్స్: మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని గురువారం సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ కె.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ చిత్రా లేఅవుట్ ఫీడర్ పరిధి కాలనీలో ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు, 11కేవీ హరిపురికాలనీ ఫీడర్ కింద మధ్యాహ్నం 12 నుంచి 1.30 గంట వరకు, 11కేవీ జైన్ మందిర్, కమలానగర్, శారదానగర్, ఆర్‌కేపురం ఫీడర్ల పరిధి కాలనీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ అంతరాయానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

షెడ్డు నిర్మాణ దాతకు సన్మానం

పహాడీషరీఫ్: పహాడీషరీఫ్ గ్రామంలోని ఆంజనేయ స్వామి దేవస్థాన ఆవరణలో కరన్‌కోట్ నాగేకార్ అమ్రేశ్వర్ తన సొంత నిధులతో షెడ్డును నిర్మించారు. తాత, నానమ్మ నాగేకార్ తుల్జారామ్, నర్సాబాయి, తండ్రి బాబురావుల జ్ఞాపకార్థంగా రూ.11 లక్షలను వెచ్చించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు దాతను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వానరసేన ప్రతినిధి లడ్డు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే సమీక్ష

మహేశ్వరం: మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ సమావేశం మందిరంలో శుక్రవారం ఉదయం 9.30 గంటలకు పలు అభివృద్ధి పనులపై వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించనున్నామని పీఏసీఎస్ వైస్ చైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వెంకటేశ్వర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమీక్షలో ఎమ్మెల్యే పి.సబితారెడ్డి పాల్గొననున్నారని తెలిపారు.

పన్నులు సకాలంలో చెల్లించండి

తుర్కయంజాల్: ఇంటి పన్ను సకాలంలో చెల్లించి, మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ కె.అమరేందర్ రెడ్డి కోరారు. గురువారం పుర కార్యాలయంలో పన్ను చెల్లించడానికి వచ్చిన ఓ వ్యక్తిని ఆయన అభినందించారు. పన్ను చెల్లించకుండా తప్పించుకునే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఈ భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

నిధులు సరే.. స్థలం ఏది?

జల్‌పల్లిలో కలగా మిగిలిన యూపీహెచ్‌సీ!

- నిధులు విడుదలయినా.. ఖరారు కాని స్థలం
- భవన నిర్మాణంలో తీవ్రజాప్యం



జల్‌పల్లి పురపాలక సంఘం కార్యాలయం

పహాడీషరీఫ్: పేద ప్రజలు నివాసం ఉంటున్న జల్‌పల్లి మున్సిపాలిటీలో ప్రభుత్వ ఆస్పత్రి ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. ఇందుకు కావాల్సిన నిధులు సైతం గతేడాదే విడుదలయ్యాయి. కానీ భవన నిర్మాణానికి కావాల్సిన స్థల లేక.. ఆస్పత్రి నిర్మాణం ప్రశ్నార్థకంగా మారింది.

అత్యధిక మురికి వాడలు

రాష్ట్రంలోని ఏ మున్సిపాలిటీలో లేనంతగా జల్‌పల్లి పురపాలికలో మురికివాడలు ఉన్నాయి. వర్షాకాలం వచ్చిందంటే డెంగీ, మలేరియా, డిఫ్తీరియా తదితర విష జ్వరాలు ప్రబలి మరణాలు సంభవిస్తుంటాయి. కరోనా సమయంలో బాలాపూర్ మండలం శ్రీరాం కాలనీలో తొలి మరణం నమోదయింది. సమస్య తీవ్రతపై అధ్యయనం చేసిన పాలకులు.. లక్షా 15 వేల జనాభా కలిగిన ప్రాంతంలో యూపీహెచ్‌సీ (పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం) ఏర్పాటు ఆవశ్యకతను గుర్తించారు. ఇందులో భాగంగానే 15వ ఆర్థిక సంఘం తరఫున ఆస్పత్రి భవన నిర్మాణం కోసం రూ.1.43 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ పనులను 2024 నవంబర్ 30న ఓ ప్రత్యేక స్థలంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఇందుకు సంబంధించిన నిధులు ఇటీవలే మున్సిపాలిటీ ఖాతాలో జమయ్యాయి.



శంకుస్థాపన చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే సబితారెడ్డి (ఫైల్)

ఖరారు కాని స్థలం

ఆస్పత్రి ఏర్పాటుకు నిధులు విడుదలైనప్పటికీ, భవన నిర్మాణానికి స్థలం ఖరారు కాలేదు. జల్‌పల్లి గ్రామంలోని బిజాన్ గుట్ట, పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న వక్ఫ్‌బోర్డు స్థలాలను పరిశీలించారు. వక్ఫ్‌బోర్డు ఆధీనంలోని స్థలంలో ఆస్పత్రి నిర్మాణానికి అనుమతులిచ్చేలా చూడాలని శంకుస్థాపన రోజే పలువురు మంత్రి దృష్టికి తెచ్చారు. అయినప్పటికీ ఫైనల్ కాకపోవడంతో కొత్తపేట పరిధి సర్వే నంబర్ 108లో 10 గుంటల స్థలాన్ని రెవెన్యూ అధికారులు గుర్తించి, కేటాయింపు కోసం కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపారు. నిర్ణయం వెలువడాల్సి ఉంది.

తీరనున్న కష్టాలు

ఆస్పత్రి ఏర్పాటుతో పేదలకు ఎంతో మేలు జరగనుంది. నిత్యం వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారు. దీంతో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందుతాయి. బాలాపూర్ యూపీహెచ్‌సీ పరిధిలోకి వచ్చే జల్‌పల్లి మున్సిపాలిటీలోని వాదే ముస్తఫా బస్తీలో కొన్నాళ్ల క్రితం తాత్కాలికంగా అద్దె భవనంలో యూపీహెచ్‌సీని ప్రారంభించారు. ఇందులో ఒక ఫార్మసిస్ట్ మాత్రమే పరిమిత సమయంలో అందుబాటులో ఉంటున్నారు. శ్రీరాంకాలనీ, పహాడీషరీఫ్, కొత్తపేటలో బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేసినప్పటికీ, అవి కూడా నామమాత్రంగానే మిగిలిపోయాయి. ప్రస్తుతం పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా శ్రీరాం కాలనీలో యూపీహెచ్‌సీ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఇదిలా ఉండగా.. ప్రస్తుతం పుర ప్రజలకు ప్రత్యేక వైద్య శిబిరాలే దిక్కయ్యాయి.



వైద్య శిబిరం (ఫైల్)

లేఖ రాశాం



యూపీహెచ్‌సీ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరుతూ బాలాపూర్ తహసీల్దార్‌కు లేఖ రాశాం. ఇంకా సమాధానం రాలేదు. ఆస్పత్రి కోసం రూ.1.43 కోట్ల నిధులు మున్సిపల్ ఖాతాలో జమయ్యాయి. స్థలం ఎంపిక కాగానే నిర్మాణం మొదలు పెడతాం. అప్పటి వరకు విష జ్వరాలు ప్రబలకుండా పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తాం.

– బి.వెంకట్రామ్, కమిషనర్, జల్‌పల్లి మున్సిపాలిటీ

నిర్మాణ రంగంలో 'భారతి సిమెంట్' రారాజు



మేస్త్రీలకు ప్రమాద బీమా బాండు, గోడ గడియారం అందజేస్తున్న సంస్థ ఇంజినీర్లు

బడంగ్‌పేట్: నిర్మాణ రంగంలో 'భారతి సిమెంట్' రారాజు అని సంస్థ టెక్నికల్ ఇంజినీర్ మహమ్మద్ సొహేర్ అన్నారు. భారతి సిమెంట్.. అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్ 5 స్టార్ గ్రేడ్‌ను తెలంగాణలో విడుదల చేసిందని తెలిపారు. గురువారం బడంగ్‌పేట్ జైరాం స్టీల్ డీలర్ షాప్‌లో తాపీ మేస్త్రీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్లతో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ వేగవంతంగా పూర్తవుతుందని పేర్కొన్నారు. అల్ట్రాఫాస్ట్ వినియోగదారులకు సంస్థ ఉచిత సాంకేతిక సహాయం అందజేస్తుందని పేర్కొన్నారు. కాంక్రీట్ సమయంలో నిపుణులైన సంస్థ ఇంజినీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయపడతారని చెప్పారు. మార్కెట్లో లభించే ఇతర సిమెంట్లతో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌కు రూ.20 అధికంగా ఉంటుందని వెల్లడించారు. ఈ సందర్భంగా తాపీ మేస్త్రీలకు రూ.లక్ష ప్రమాద బీమా బాండ్లను అందజేశారు. కార్యక్రమంలో సంస్థ బృందం, 50 మందికి పైగా తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి



మేడిపల్లిలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న మాజీ సర్పంచ్ నవీన్

- మొయినాబాద్ ఎస్ఐ ముజాఫర్‌అలీ
- క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతుల ప్రదానం

మొయినాబాద్: యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని మొయినాబాద్ ఎస్ఐ ముజాఫర్‌అలీ అన్నారు. శివరాత్రి సందర్భంగా బుధవారం రాత్రి సురంగల్‌లోని గాండ్ల సంతోష్‌కుమార్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహించిన క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 40 జట్లు ఇందులో పాల్గొన్నాయి. ఫ్లడ్ లైట్ల వెలుతురులో గురువారం ఉదయం వరకు పోటీలు కొనసాగాయి. విజేతగా నిలిచిన చేవెళ్ల జట్టుకు రూ.5 వేల నగదుతో పాటు షీల్డు, రెండో స్థానంలో నిలిచిన తోలుకట్ట జట్టుకు రూ.1,500 నగదు, ట్రోఫీ అందజేశారు. కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకుడు మేకల మల్లేశ్, నాయకులు సీతారెడ్డిరెడ్డి, ప్రభుయాదవ్, రాజుయాదవ్, జగన్, విజయ్‌గౌడ్, చంద్రశేఖర్‌రెడ్డి, వీరు, పాండుయాదవ్,జగన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని మేడిపల్లి మాజీ సర్పంచ్ కామని నవీన్ అన్నారు. శివరాత్రి సందర్భంగా బుధవారం రాత్రి గ్రామంలో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో రాణించే యువత, విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. పది జట్లు పాల్గొన్న టోర్నీలో కె.విజయ్ టీం మొదటి బహుమతి, జి.మహేశ్ జట్టు రెండో బహుమతి గెలుచుకున్నాయి. కార్యక్రమంలో ఆర్గనైజర్లు బి.అంజి, కె.రాజు, ఎ.శ్రీకాంత్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిభావాన్ని అలవర్చుకోవాలి

- జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు తాండ్ర విశాల
- అల్వాలలో ఉత్సాహంగా బండలాగుడు పోటీలు
- విజేతలకు బహుమతుల ప్రదానం



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న విశాల

కేశంపేట: సమాజంలో ప్రతిఒక్కరూ భక్తిభావాలను అలవర్చుకోవాలని జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు తాండ్ర విశాల అన్నారు. మండల పరిధిలోని అల్వాలలో కొనసాగుతున్న రామలింగేశ్వర భ్రమరాంబిక ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం బండలాగుడు, ట్రాక్టర్ రివర్స్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె పోటీలను ప్రారంభించి, రైతులు, క్రీడాకారులను అభినందించారు. పండుగ వాతావరణంలో వేడుకలు నిర్వహించుకోవడం గొప్ప విషయమన్నారు. విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సురేష్‌రెడ్డి, యెన్నం శ్రీధర్‌రెడ్డి, పల్లె అనంద్‌కుమార్, తాండ్ర శ్రావణ్ రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా బ్రహ్మోత్సవాలు

- రాజరాజేశ్వర, వీరాంజనేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- ఉత్సవంలో పాల్గొన్న భక్తజనం



ఘట్టుపల్లిలో శివ పార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

మహేశ్వరం: మహా శివరాత్రిని పురస్కరించుకుని మహేశ్వరం శివగంగ రాజరాజేశ్వర బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మూడో రోజైన గురువారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం మంగళ గౌరీశ్వరుడు, మల్లీశ్వరుడు, అఘోరేశ్వరుడు, కాశీపతీశ్వరుడు, గంగాదరేశ్వరుడు, ఇష్టకామేశ్వరుడు, ముక్తేశ్వరుడు, ఏకాంబరేశ్వరుడు, అమరావతీశ్వరుడు, హరిహరేశ్వరుడు, అమరేశ్వరుడు, మణికర్ణికేశ్వరుడు, మహానందీశ్వరుడులకు అభిషేకం, హారతి, కుంకుమార్చన, మత్రపుష్పం, పుష్పాలంకరణ, మంగళహారతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం రాత్రి ఆలయ ఆవరణలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన భక్తి గీతాలు, నాటికలు, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించారు. ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ చైర్మన్ అల్లె కుమార్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఆలయ కమిటీ డైరెక్టర్లు మోదిని రాకేష్, ఒగ్గు శంకర్, సువర్ణ, పోతర్ల తిరుపతయ్య, నరేష్, ఏపూరి సాయిలు, కనగట్ల శ్రీశైలం, ఆలయ ఈఓ మురళీ కృష్ణ, ప్రధాన పూజారి వీరేశం పాల్గొన్నారు.

వీరేందర్ ప్రత్యేక పూజలు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం మధ్యాహ్నం బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్ గౌడ్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శివగంగ రాజరాజేశ్వర ఆలయం అతిపురాతనమైనదని, ఆలయ అభివృద్ధికి తమవంతు కృషి చేస్తానని తెలిపారు. ఆలయ చైర్మన్ అల్లె కుమార్, డైరెక్టర్లు వీరేందర్ గౌడ్‌ను ఘనంగా సన్మానించి, జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో మహేశ్వరం ఎంపీటీసీ మాజీ సభ్యుడు పోతర్ల సుదర్శన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వీరాంజనేయ స్వామి ఆలయంలో

మండల పరిధి ఘట్టుపల్లి వీరాంజనేయ స్వామి ఆలయంలో శివరాత్రి సందర్భంగా రెండో రోజు గురువారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం స్వామివారికి అభిషేకం, హారతి, కుంకుమార్చన, మంత్ర పుష్పం, పుష్పాలంకరణ తదితర పూజలు నిర్వహించారు. తెల్లవారు జామున అగ్ని గుండాలపై భక్తులు నడిచారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టీలు, మాజీ ఎంపీపీ కొరుపోలు రఘుమారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఆలయ కోశాధికారి శివకుమార్, మాజీ సర్పంచ్ అనితారెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ రాకేష్‌రెడ్డి, ఆలయ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది వీరేశం, ఆలయ పూజారులు పలువురు పాల్గొన్నారు.

శివపార్వతుల కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న పండితులు

మహేశ్వరం: మహా శివరాత్రిని పురస్కరించుకుని మండల పరిధి మన్సాన్‌పల్లి గ్రామంలోని శివాలయంలో గురువారం శివ పార్వతుల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో దేవతా మూర్తులకు అభిషేకం, హారతి, కుంకుమార్చన, మంత్ర పుష్పం, పుష్పాలంకరణతో పాటు శివ లింగానికి పాలాభిషేకం, జలాభిషేకం చేశారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య శివ పార్వతుల కల్యాణం జరిగింది. స్వామివారికి మల్లేశ్ యాదవ్ దంపతులు పట్టు వస్త్రాలను సమర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు మల్లేశ్ యాదవ్, కంది అరుణ, మాజీ ఉప సర్పంచ్‌లు రమేష్, బి.నర్సింహ యాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సామ జాన్‌రెడ్డి, గ్రామ పెద్దలు ఆంజనేయులు గౌడ్, బాల్‌రాజ్ గౌడ్, రాఘవేందర్‌రెడ్డి, రాఘవేందర్ గౌడ్, రమేష్, రాజు యాదవ్ తదితరుల పాల్గొన్నారు.

జాతరలో ఉచిత వైద్య శిబిరం



చేవెళ్లలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి జాతరలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ వైద్య శిబిరం

- ప్రజలు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి
- వైఆర్‌జీకే సూపర్‌వైజర్ రాములు, ఐసీటీసీ కౌన్సిలర్ ప్రతాప్‌రెడ్డి

చేవెళ్ల: మండల కేంద్రంలోని జాతరలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైఆర్‌జీకే సూపర్‌వైజర్ రాములు, ఐసీటీసీ కౌన్సిలర్ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. శిబిరంలో భాగంగా గురువారం హెచ్‌ఐవీ నిర్మూలనపై అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. చేవెళ్లలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద వారంరోజుల పాటు కొనసాగే ఉత్సవాల్లో భక్తుల కోసం ప్రత్యేక మెడికల్ క్యాంప్ ప్రారంభించామని తెలిపారు. భక్తులకు ఎలాంటి అనారోగ్య సమస్యలు ఎదురైనా వెంటనే చికిత్సలు చేయించుకోలని సూచించారు. ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు అందుబాటులో ఉంటారని స్పష్టం చేశారు. అనంతరం హెచ్‌ఐవీ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు అనంతలక్ష్మి, అనిత, సునీత, ఏఎన్ఎంలు తదితరులు ఉన్నారు.

అన్నదానం అభినందనీయం

ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: ప్రతిఒక్కరూ సేవాదృక్పథాన్ని కలిగి ఉండాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. పట్టణంలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ జాతరలో భాగంగా కుంచం పెంటయ్య సన్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచితన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జాతరకు వచ్చే భక్తుల ఆకలి తీర్చేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. దాతలు పెంటయ్య, శివకుమార్, నరేశ్, నాయకులు దేవర వెంకట్‌రెడ్డి, క్రిష్టారెడ్డి, యాదగిరి, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏడుపాయలలో దుర్గమ్మ దర్శనం..

ఎమ్మెల్యే కాలె యాదయ్య గురువారం మెదక్ జిల్లాలోని ఏడుపాయల దుర్గమ్మ ఆలయాన్ని సందర్శించారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



చేవెళ్లలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య దాతలు,నాయకులు

ఘనంగా వార్షికోత్సవం



అన్నదానం చేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

తుక్కుగూడ: పుర పరిధి రావిర్యాల శ్రీ ఓంకారేశ్వర స్వామి ఆలయ సప్తదశ(17వ) వార్షికోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. మూడో రోజైన గురువారం ఆలయంలో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ చైర్మన్ మాధవరెడ్డి, పూజారి చంద్రశేఖర్, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు ఉన్నారు.

రోడ్లతోనే గ్రామాల ప్రగతి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

- పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- రహదారుల విస్తరణకు సహకరించాలని ప్రజలకు పిలుపు

నందిగామ: రోడ్లతోనే గ్రామాలు అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా బుగ్గోనిగూడలో జెడ్పీ నిధులు రూ.10 లక్షలతో డ్వాక్రా భవనం, బండోనిగూడలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.20 లక్షలతో సీసీ రోడ్లు, చేగూరులో సీఆర్‌ఆర్ నిధులు రూ.18 లక్షలతో సీసీరోడ్లు, వెంకమ్మగూడలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.20 లక్షలతో గ్రామ పంచాయతీ భవనం, మామిడిపల్లిలో సీఆర్‌ఆర్ నిధులు రూ.24 లక్షలతో సీసీ రోడ్లు, అంతర్గత మురుగు కాల్వలకు సంబంధించిన పనులను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రోడ్లు బాగుంటేనే గ్రామాలు బాగుంటాయని తెలిపారు. ఆయా గ్రామాల్లో కొనసాగుతున్న డబుల్ రోడ్ల నిర్మాణం, విస్తరణకు ప్రజలు సహకరించాలని కోరారు. అనంతరం తన స్వగ్రామమైన వీర్లపల్లి శివాలయంలో నిర్వహించిన స్వామివారి కల్యాణ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జంగ నర్సింహయాదవ్, మాజీ ఎంపీటీసీలు దేపల్లి కుమార్, కొమ్ము కృష్ణ, చంద్రపాల్‌రెడ్డి, చంద్రశేఖర్, నాయకులు నవీన్ గౌడ్, పసుల బుచ్చయ్య, రాజగోపాల్‌గౌడ్, చిందం నర్సింహ, నవాజ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.